# ఇంటర్వ్యూ



వై. యం. శర్మ

నిజం కథకన్న నమ్మ శక్యంకానిది. అవును నిత్యము నిన్ను తప్పులు పట్టి నిందించే అధికారి ఒక సుప్రభాతాన నిన్ను ప్రశంసలతో ముంచెత్తితే నీ కెలా ఉంటుంది? నీకు డిపాజిట్టు పోతుందనుకున్న ఎలెక్షన్లో నీ ప్రత్యర్థి ఓట్లు చీలి బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచావని తెలిస్తే నువ్వేమనుకుంటావు? నిలవ ఉండి పుచ్చిపోతున్న నీ సరుకు పదిరెట్ల ధరతో ఓ పరదేశి కొనవస్తే నీకేమనిపిస్తుంది? 'నక్కని తొక్కాను ఇవ్వాళ!' అని అనుకుంటావు కదూ?

నాన్న కన్నుమూస్తూ నన్ను పొదివిపట్టుకుని అమ్మతో "జ్ఞానీ, గాయత్రీదేవి మన ఇంటపుట్టింది, కొడుకైనా కూతురైనా మనకు మన వంశానికి ప్రతిష్ఠ తెచ్చేది, నీకు నీ వృద్ధాప్యంలో సుఖ శాంతులు సమకూర్చేది అదే! కంటికి రెప్పలా కనిపెట్టి చూసుకో, నీ బిడ్డ యోగ్యతే నీకు నే నిచ్చే ఆస్తి!" అంటూ అప్పగించారు. నాన్నకు నామీద ఉన్న విశ్వాసానికి నన్ను నేనే మరిచిపోయాను!

నాన్న నన్ను గురించి ఇచ్చిన భరోసాతో అమ్మ అవధులుమించి కష్టపడి నన్ను చదివించింది. చిన్నతనం నించీ చదువంటే ఇష్టమేమో, అన్నిక్లాసులలోను ఫస్టుమార్కులతో పాసయ్యాను మగపిల్లల కన్నెర్రగా.

(31 వ పేజీ తరువాయి)

మాట్లాడుకుందాం" రాజీకి దిగినట్టనిపించింది.

"మీరే డిపార్టుమెంటుకు సెలెక్టౌతా?" యథాలాపంగా అడిగినట్టడిగాను కుతూహలం వీలైనంత దాచుకుంటూ.

"తమరు పరాకు చిత్తగిస్తున్నట్టున్నారు, ఇంకా నేను సెలెక్టవలేదు, ఇంటర్వ్యూకే ఇప్పుడు నేను వెళుతున్నది!"

"ఔ నదే!"

"మీపద్ధతి బాగాలేదు, మొదటి అడిగినవాళ్లకు ముందు చెప్పడం న్యాయం."

"లేడీస్ ప్లీజ్!"

"సరే, నేను ఐ.సి.యు.ఆర్. వాళ్ల సెకండరీ ఎడ్యుకేషన్‌లో ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రామ్సులో తెలుగు ప్రాంతానికి వైజాగులో కొత్తగా ఏర్పాటుచెయ్యబోయే ఆఫీసు డైరెక్టరు పనికి ఇంటర్వ్యూయీగా వెళ్తున్నాను."

"మీరా?" గుడ్లు మిటకరించాను, 'ఇంతగా ఆశ పెట్టుకున్న ఈ ఒక్క ఛాన్సూ ఇతగాడు కొట్టేస్తాడు గాబోలు' నన్న ఈర్ష్యకొద్దీ.

"అంటే? . . ఓ, ఒకేపనిమీద ఒకేచోటన ఇద్దరం తలవని తలంపుగా కలిసి ప్రయాణించటం, చిత్రంగా లేదూ? . . యస్, గాడ్ ఎక్జిస్ట్స్: సందేహంలేదు!"

"మీ లాజిక్కుకు నాకు నవ్వొస్తున్నది!"

"మీరేమన్నా అనండి, నేను చాలా నిశ్చితాభిప్రాయాలు కలవాణ్ణి, ఒకంతట మార్చుకోను, ఇదీ శుభసూచకమేనని మీరెందుకనుకోరాదూ?"

"ఔనౌను! విజయదశమినాడు ఇద్దరు యుద్ధం చేస్తే తప్పక గెలుస్తారుట ఇద్దరిలో ఒకరు!"

"ఇద్దరూ చావకుండా!" మనస్సు విప్పినట్టు నవ్వేశాడు.

"మీరే గెలుస్తారు, పందెం!"

"మీకెలా తెలుసు? మీ వాలకంచూస్తే గుర్రప్పందాలు కాచిన వాళ్లలా కనబడటం లేదే?"

"ఉట్టినే, ఊహాతట్టే చెబుతున్నాను, మీ ధైర్యం మీపద్ధతి చూస్తే మీకు ఉద్యోగం వచ్చేసినట్టే తోస్తోంది నాకు."

"మనం అనుకున్నవన్నీ అయితే ఇంక ఛాన్సుకు అవకాశం లేదన్నమాట!"

"ఏమో అంత నిక్కచ్చిగానే నాలోచించలేదు, మనస్సుమాత్రం మీకు ఛాన్సు ష్యూరన్నట్టు హెచ్చరిస్తోంది!"

"నిక్కచ్చిగానే ఆలోచింతాం, మీరేమనుకోకుండా ఉంటే, —"

"అబ్బే, నే నెందుకేమనుకోవటం, మీ ఉద్యోగపు ఛాన్సు మీ రాలోచిస్తోంటే?"

"నా ఉద్యోగపు ఛాన్సుసుగూర్చి మీ ఆలోచనా పద్ధతిని కొంచెం తరిచి చూతాం."

"చెప్పండి."

"మీరిదివరలో చాలా ఇంటర్వ్యూలకు వెళ్లారు, ఔనా?" అని తల ఊపాను.

"వాటిలో చాలా కష్టనష్టాలకు గురిఅయ్యారు."

"ఉద్యోగానికి మీరు తగకనో, ఉద్యోగం మీకు తగకనో, అన్నీ తగిఉన్నా సమయం కలిసిరాకనో ఉద్యోగాలన్నీ తప్పిపోయాయి. దానితో మీకు విసుగూ, కసీ ఏర్పడ్డాయి."

మనిషిని నిలువునా చంపేస్తున్నాడనిపించింది.

"మీరెలా పోల్చారు?" అన్నాను.

"ప్రతి చిన్న విషయంలోను మీరు చూపే చిరాకు, వెంటనే దాన్ని కప్పిపుచ్చుకోవాలనే తపన మీ నిరాశానిస్పృహల నిట్టే పట్టేస్తున్నాయి."

"ఎక్స్‌క్యూజ్ మీ" సిగ్గుతో తలవంచుకున్నాను.

"మన్నించండి మాడమ్, మీ లోపాన్ని గుర్తుకు తెచ్చి మీ మనస్సు నొప్పించడంకాదు నా ఉద్దేశ్యం. మీ బాహ్య ప్రవర్తననుబట్టి మీ మానసిక స్థితిని స్టడీచేస్తున్నా నంతే. మీ అర్హత పదిమందీ గుర్తించాలనీ, మీ కృషికి మెప్పురావాలనీ మీరు తపించిపోతున్నారు. మీరు చేసిన ప్రయత్నాలన్నీ మీకు అననుకూలమై మిమ్మల్ని సినిక్కుగా తయారుచేసి మీ ఆత్మవిశ్వాసాన్ని విచ్ఛిన్నం చేశాయి."

"ఇంత నిశితంగా కేస్ స్టడీ చేస్తున్న మీతో పోటీకి నిలిచేందుకు నా క్వాలిఫికేషన్లు ఏం పనికొస్తాయి చెప్పండి!" నా అభినందనలో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు దొర్లకుండా ఆపలేకపోయాను.

"ఇంకా అదే ధోరణిలో నడుస్తోంది మీ ఆలోచన. మీ అర్హతలు శక్తిసామర్థ్యాలు పనిలో చూపిస్తే ప్రపంచం మిమ్మల్ని కళ్లకద్దుకుంటుంది. ఆర్థికమయిన ఇబ్బందుల వల్ల అవకాశం వచ్చే వరకు ఆగలేక వేగిర పడుతున్నారంతే."

"నాకాళ్లమీద నేను నిలబడాలని కోరుకోవటం వేగిరపాటెలా అవుతుంది? పోటీవల్ల దేశ సంపద ఎంత వ్యర్థమౌతున్నదో ఆలోచించారా?"

"మీరు మీకాలం క్షణం వ్యర్థం చెయ్యకుండా కల్పించుకోదగ్గ వ్యాపకాలెన్నో ఉన్నాయి. ఈ పని మనకు తగనిది అని చెయ్యి ముడుచుకు కూచోవటమే మన మధ్యతరగతి కుటుంబాలు కొనితెచ్చి పెట్టుకుంటున్న అనర్థం. చేతినిండా పనిఉంటే అటు మీకు సత్కాలక్షేపము అవుతుంది. దేశానికి ఓపినంత సేవజేస్తున్నామన్న తృప్తి మీకుంటుంది. ఇంక లోకం మరమ్మత్తునుగూర్చి ఆలోచించే వ్యవధే మీకుఉండదు."

"అవకాశం దొరికితేగదా శక్తి వినియోగించి సేవ చేసేందుకు?"

"దొరికిన అవకాశాలు జారవిడుచుకోకపోతే పదివేలు."

"అవకాశాలు యాదృచ్ఛికంగాగానీ, అభిమానుల సహాయంవల్లగానీ దొరకవలసిందేకాని ప్రజాశక్తిని పద్ధతిప్రకారం వినియోగించుకో గలుగుతున్నదా ప్రభుత్వం?"

"ఒకరు చెయ్యలేక పోయారని తప్పు పట్టుతున్న పని చేతనైనప్పుడు చేసి చూపించడం శక్తికి నిదర్శనం!"

అలా అలా వాదించుకుంటూ చాలా పొద్దు మింగేశాం. ఆ ఆత్మ విశ్వాసం, ఆ కలుపుగోలుతనం, ఆ స్నేహశీలత చూచి నాకు తెలియకుండానే నాలో ఆయన మీద సదభిప్రాయం కలిగింది.

"పొద్దుపోయిందాకా మిమ్మల్ని విసిగించాను, నిద్రపొండి. మంచి మంచి కలలతో మీ చీకు చింత మరిచిపొండి. 'రేపునాదే?' అన్న సత్యం మననం చేసుకోండి. అన్నట్టు ఈ చలిలో ఇలా వణికిపోతూ ఉంటే నిద్దరెలా వస్తుంది? ఉండండి నా దగ్గర రగ్గు ఉంది కప్పుకుందురు గాని!" అమ్మను జ్ఞప్తికి తెస్తున్న ఆయన ఆప్యాయత నిజంగా నన్ను కనికట్టు కట్టేసింది!

"పర్వాలేదండీ, నాకాట్టే చలిగాలేదిక్కడ, మీ సహాయానికి కృతజ్ఞురాలిని. నాకోసం మీరు చలిలో బాధపడటం నేను సహించలేను" మాట మర్యాద నిలబెట్టుకున్నాను.

"నాకు ఉలెన్ మాకింటోషు ఉంది." పెట్టెలో నించి రగ్గుతీసి కప్పాడు పసివాణ్ణి జోకొట్టే గారడీ వాడిలా. అవసరం ఉండీ, అంత ఆప్యాయంగా ఇస్తున్న ఆ రగ్గు తిరస్కరించటం భావ్యంకాదని అది కప్పుకుని కృతజ్ఞత తెలియజేసి నిద్రాదేవి ఒళ్లో ఒరిగిపోయాను, భారం దేవుడిమీద పారేసి. తెల్లవారుగట్ల లేచిచూద్దును, కిందిసీట్లో కూరుకులేకుండా నన్ను కాపలాకాస్తున్నాడు! సుప్రభాతంతో పలకరించాను.

తెలుగుప్రాంతంనుంచి వచ్చిన వాళ్లం మేమిద్దరమే అవటంవల్ల మా పని త్వరగానే తెమిలింది. తన ఇంటర్వ్యూ పూర్తిచేసుకువచ్చి ఏమేమి ప్రశ్నలువేసిందీ చెప్పి ప్రోత్సాహం ఇచ్చి పంపించారు నన్ను. ఏవేవో సామాన్య ప్రశ్నలు చాలా అడిగారు వాళ్లను. ముఖ్యంగా నా ఆదర్శ పథకమేమిటో అడిగి తెలుసుకున్నారు. వాళ్లకు నచ్చినట్టే కనపడ్డది నా సమాధానం. నా శాయశక్తులా పనిచేసి విద్యుక్తధర్మం ప్రజానీకానికి ఉపయోగపడేట్టు, పై అధికారులకు తృప్తి కలిగించేట్టు, నెరవేరుస్తానని మాట ఇచ్చి సెలవు తీసుకు వచ్చేశాను. నా ఇంటర్వ్యూ సంగతి అడిగి తెలుసుకుని చాలా సంతోషించారాయన.

నాకుమటుకు మనస్సులో బెరుకుగానే ఉంది. ఆ సాయంత్రం కానాట్ ప్లేసులో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నప్పుడు "ఎందుకమ్మాయ్, అలా అధైర్య పడతావు? తేలిగ్గా తీసుకో" అని ఓదార్చారు.

"ఏమోనండీ, ఇది నా ఆఖరి ప్రయత్నం. గంపెడాశతో వచ్చాను." చెమర్చిన కళ్లు ఒత్తుకున్నాను ముఖం పక్కకు తిప్పుకుని.

"గోడమీదిపిల్లి వాటంగా ఉండే ఈ ఇంటర్వ్యూలను నమ్ముకుని ఏం ప్రయోజనం?" నిట్టూర్చాను.

"మరేం భయంలేదు, దిగులు పడకు!"

"ఇంక దిగులు పడి చేసేదీలేదు" అన్నాను ఆయన ఇచ్చే భరోసా ఏమిటో అర్థంకాక.

"నా మాట నమ్మలేవా?" అన్నారు ఆప్యాయంగా.

"ఇంతగా నన్ను ప్రోత్సాహపరుస్తున్న మీ మాటల్లో నమ్మకంలేకకాదు. అయినా, నా అదృష్టం ఎలా ఉంటుందో మీరెలా నిర్ణయించగలరో తెలియక తికమక పడుతున్నాను."

"నీ కనుకూలంగా నా అవకాశం వదులుకున్నాను." అంత నిర్లిప్తంగా చెబుతున్న ఆయన ఋషితుల్యులుగా కనిపించారు నాకు!

"ఎంత మంచివారండీ! మీ త్యాగానికి ఏమనాలో తెలియక తబ్బిబ్బౌతున్నాను." అన్నా ఆయన చేతులు పట్టుకుని కృతజ్ఞత తొణికిసలాడే కళ్లతో!

"త్యాగమేం చెయ్యలేదులే, నిన్ను నా అసిస్టెంటుగా అడిగి వేయించుకున్నాను" చిరునవ్వు నవ్వారు నా కళ్లలో తను పాప చూసుకుంటూ!